క్లుప్తంగా

'వేద'లో స్వర్ణ ప్రాశన


పిల్లలకు స్వర్ణ ప్రాశన వేస్తున్న అంజిరెడ్డి

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం 100 మంది చిన్నారులకు ఉచిత స్వర్ణ ప్రాశన వేశారు. అనంతరం డాక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతీనెల ఉచితంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. స్వర్ణప్రాశనతో పిల్లల్లో ఇమ్యూనిటీ పెరగడంతో పాటు కండరాల పటిష్టత, మెదడు పనితీరు మెరుగుపడడం, అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు.

జీడీ ప్రసాద్‌కు ఫిల్మ్ అవార్డు



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జీడీ ప్రసాద్ ఫిల్మ్ అవార్డును అందుకున్నారు. వివిధ కళాకారులకు, సేవారంగాల్లో సేవ చేసిన వారికి కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డులను తెలుగు సినీ నిర్మాత, కమిటీ ఫౌండర్, చైర్మన్ తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కమిటీ చైర్మన్, గబ్బర్ సింగ్ సినిమా డైరెక్టర్ హరీష్‌శంకర్ ఎంపిక చేశారు. ఈ మేరకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జీడీ ప్రసాద్.. ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

వనమహోత్సవం



జనగామ: జనగామ బర్త్ డే ట్రీ ఆధ్వర్యంలో పట్టణంలోని చమన్ భగత్‌సింగ్ చౌక్ ప్రాంతంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. సిద్దిరాల సాయి తేజ జన్మదినం పురస్కరించుకుని మొక్కను నాటి, సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమరాజు, కొయ్యాడ రవి, మోతే వెంకటయ్య, నరేష్ ఉన్నారు.

ఆధ్యాత్మిక భజన ప్రదర్శనలో మల్కాపూర్ వాసులు



చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీ భక్త మార్కండేయ భజన మండలి సభ్యులు బుధవారం కరీంనగర్‌లో ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన ఆధ్యాత్మిక భజన కార్యక్రమంలో బత్తిని ఎల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో 12 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువారం మల్కాపూర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన తమ బృందం పాల్గొంటుందని తెలిపారు. అందులో భాగంగా కరీంనగర్‌లో ఏకధాటిగా 10 గంటల పాటు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్‌నేషనల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గూటం సంపత్ రెడ్డి, పోలేపల్లి వెంకట్‌రెడ్డి, తోకల సంపత్‌రెడ్డి, పెనుకుల రాజు, కొంరయ్య, మాదిరెడ్డి మోహన్‌రెడ్డి, సుదర్శన్, రాజయ్య, రామకృష్ణ, సత్యనారాయణలు పాల్గొన్నట్లు తెలిపారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ రూరల్: కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని కోరుతూ అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, సోయం బాబురావు, ప్రియాంక గాంధీకి వినతి పత్రం అందజేశారు.

కాల్వ మరమ్మతుకు నిధులు మంజూరు

బచ్చన్నపేట: లక్ష్మాపూర్ గ్రామ శివారు నుంచి కొడవటూర్ ఊర చెరువుకు గోదావరి నీళ్ల తరలించేందుకు కాల్వ మరమ్మతు పనులకు నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకుడు ఇజ్జగిరి రాములు తెలిపారు. గురువారం బండనాగారంలో ఆయన మాట్లాడుతూ కాల్వ మరమ్మతుకు రూ.10.15 లక్షల నిధులను నీటి పారుదల శాఖ నుంచి డీసీసీ అధ్యక్షుడు మంజూరు చేయించారని చెప్పారు. కొడవటూర్ నుంచి బచ్చన్నపేట, పోచన్నపేట గ్రామాల చెరువులకు గోదావరి జలాలు ఎవరికి ఇబ్బంది కలిగించకుండా వెళ్తాయని చెప్పారు. నాయకులు కొల్ల నర్సిరెడ్డి, ఇజ్జగిరి నరేష్, కర్ణాకర్ పలువురు ఉన్నారు.

నేటినుంచి శ్రావణ మాసం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- పుణ్యక్షేత్రాల ముస్తాబు

జనగామ: నేటి(శుక్రవారం) నుంచి శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఈ వేడుకలతో దేవాలయాలు, గృహాల్లో పండగ శోభ సంతరించుకుంది. శుక్రవారం శ్రావణం ప్రారంభమవుతుండడంతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. శ్రావణ మాసం పురస్కరించుకుని నిత్య సుమంగళి, ఆయురారోగ్యాలు ఉద్యోగ, సిరిసంపదలు, వ్యాపారాభివృద్ధి చెందాలని అమ్మవారిని కొలువడం ఆనవాయితీ. శ్రావణమాసం ప్రారంభంతో పూజా సామగ్రి, పూలు, పండ్ల కొనుగోలుతో దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. బానాపురం వేంకటేశ్వరస్వామి, రైల్వేస్టేషన్ ఏరియా చెన్నకేశ్వరస్వామి, గుండ్లగడ్డ శ్రీ ఉమామహేశ్వరస్వామి, గణేష్‌వాడ శ్రీ అభయాంజనేయస్వామి, సిద్ధి, బుద్ధి గణపతి ఆలయం, చిల్పూరు బుగులోని వేంకటేశ్వరస్వామి, పాలకుర్తి సోమేశ్వర, లింగాలఘనపురం జీడికల్ సీతారామచంద్రస్వామి, బచ్చన్నపేట కొడవటూరు సిద్ధులగుట్ట తదితర ఆలయాలకు నాలుగు వారాల పాటు భక్తులు పోటెత్తనున్నారు.


జనగామ బానాపురం శ్రీవేంకటేశ్వర ఆలయం

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సాక్షి నెట్‌వర్క్: సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, దీర్ఘకాలికంగా నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీల ఆధ్వర్యంలో పలు మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ఆధునిక యుగంలో పోటీని తట్టుకోలేక ఆర్థికంగా చితికిపోయిన స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకార సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు నారోజు రామేశ్వరచారి కోరారు. గురువారం పట్టణంలోని స్వర్ణకార సంఘం భవనంలో మారోజు మల్లికార్జున చారి అధ్యక్షతన నిర్వహించిన పట్టణ స్వర్ణకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణ స్వర్ణకారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వలబోజు చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా కందుకూరి సంతోష్, కార్యదర్శిగా సరబోయిన ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా పోతకనూరి కనకచారి, కోశాధికారిగా ఎర్రోజు శ్రావణ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో వలబోజు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, సురేందర్, కిరణ్ చారి, ఆంజనేయులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పట్టణ స్వర్ణకారుల నూతన కమిటీ సభ్యులు

లక్ష్యంతో ముందుకెళ్లాలి


బోధిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రఘునాథపల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు వెళ్తే ఆశయాలు నెరవేరుతాయని నవ సమాజ్‌సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పరీదుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం కోమళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోటివేషనల్ క్లాస్‌లో ఆయన బోధించారు. విద్యార్థులు జీవితంలో ఎదగడానికి విద్యతో పాటు, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమ కారులు బొల్లపల్లి శ్రీనివాస్, బంద యాదగిరి, పాఠశాల ఇన్‌చార్జ్ సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఆపరేటర్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రఘునాథపల్లి: ఐకేపీ కేంద్రాల నిర్వాహకుల నుంచి వసూళ్లకు పాల్పడిన పౌరసరఫరా శాఖలోని ఆపరేటర్లను విధుల నుంచి తొలగించారు. రీకన్సీలేషన్ కోసం ఐకేపీ నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఉదంతంపై ఈ నెల 24న సాక్షిలో ప్రచురిత మైన కథనంపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఐకేపీ కేంద్రాల రికన్సీలేషన్ కోసం హాజరైన సందర్భంగా ఖర్చుల నిమిత్తమంటూ అక్కడి ఇద్దరు ఆపరేటర్లు నిర్వాహకుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. ఒక్కో కేంద్రం నుంచి రూ. 1,000 చొప్పున వసూలు చేశారు. ఆధారాలతో సహా ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు బహిర్గతం చేయడంతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఆపరేటర్లు డబ్బులు వసూలు చేసినట్లు రుజుకు కావడంతో వారిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ వి హతిరామ్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న డీఈఓ భోజన్న

- డీఈఓ భోజన్న

రఘునాథపల్లి: చదువుతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ భోజన్న అన్నారు. బాంజీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానికుడు చెరుకు రమేష్ రూ.50 వేల విలువ కలిగిన స్పోర్ట్స్ డ్రెస్, షూ, టై, బెల్ట్, ఐడీ కార్డులు పంపించగా.. చెరుకు గౌరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు లింగమూర్తి, విద్యాసాగర్‌లు రెండు సౌండ్ బాక్స్‌లు, ఆంపిల్ ఫయర్‌లను పాఠశాలకు అందించగా గురువారం డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. అదే విధంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు పోశాల చంద్రయ్యను డీఈఓ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ఎంఈఓ రఘునందన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొరిగ భాగ్యరవి, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీలు పఠనా నైపుణ్యాలను పెంచుతాయి

జనగామ రూరల్: పాఠశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే లైబ్రరీలు పాఠ్యాంశాలకు అనుబంధంగా విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదపడుతాయని డీఈఓ భోజన్న అన్నారు. పట్టణంలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో పాఠశాలల్లో గ్రంథాలయాల నిర్వహణపై ప్రతీ స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో అకడమిక్ మానిటరింగ్ అధికారి బొమ్మనబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించిన డీఈఓ

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను డీఈఓ భోజన్నతో పాటు మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

ప్రజలను పక్కదారి పట్టించేందుకే అసత్య ప్రచారాలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల: ప్రజలకు పక్కదారి పట్టించేందుకు అసత్య ప్రచారాలు చేయడం బీఆర్‌ఎస్‌కు పరిపాటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, విజయ డెయిరి జిల్లా చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వానకొండయ్య దేవుని గుట్టకు ఒక వైపు క్వారీకి అనుమతులిచ్చి మరోవైపు అభివృద్ధి పేరిట నిధులు కేటాయించి పూర్తి చేయని నైజం వారిదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో దేవాదాయ శాఖ ద్వారా గర్భగుడితో పాటు భక్తులకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం రూ. కోటి మంజూరు చేస్తే స్వాగతించేది పోయి అర్థరహిత విమర్శలు చేయడం బీఆర్‌ఎస్ నాయకులకు తగదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అర్థరహిత విమర్శలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. ఓయూ జేఏసీ నాయకుడు నరేందర్‌పవార్, బీసీ, ఎస్టీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు కాడబోయిన గణేష్, భూక్యా సజ్జన్, మహ్మద్ రసూల్, యూత్ మండల అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



జిల్లా కేంద్రం గుండ్లగడ్డ కాలనీకి చెందిన రామగిరి శ్రీనివాసులు, రమాదేవి దంపతుల స్వగృహంలో బుధవారం అర్ధరాత్రి 2.30 గంటలకు ఎనిమిది బ్రహ్మ కమలం పువ్వులు వికసించాయి. హిమాలయాల్లో కనిపించే మహిమాన్వితమైన పువ్వు పూసిందని తెలుసుకున్న చుట్టపక్కల కుటుంబాలు అక్కడకు వచ్చి దర్శించుకున్నారు. బ్రహ్మ కమలాన్ని లక్ష్మీదేవి, సరస్వతీ దేవీ స్వరూపని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

-జనగామ

రైతులకు సరిపడా యూరియా

బచ్చన్నపేట: యూరియా కోసం దిగులు చెందకూడదని, అందరు రైతులకు సరిపడా యూరియా ఉందని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో ఉన్న ఎరువులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో రైతులు పంటలకు యూరియాను ఎక్కువగా వినియోగించరాదని, వర్షపు నీటిలోనే నత్రజని ఉంటుందని తెలిపారు. సొసైటీలో 651 బస్తాల యూరియా ఉందని, మరికొన్ని బస్తాల యూరియాను తెప్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా రైతులు పంటలకు తెగుళ్ల సోకితే ఆయా గ్రామాల పరిధి ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.


యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏఓ

స్థానిక సమరానికి సిద్ధం కావాలి


కొడకండ్ల: మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని, పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. మహేందర్, కోటేశ్వర్, సృజన్, కనకయ్య, వాసునాయక్, నివాస్‌నాయక్, అంజనేయులు, మహేష్, పరమేశ్, శ్రీనివాస్, లక్ష్మణ్, సంపతయ్య, చందర్, సుధాకర్, రామకృష్ణ, అజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి

చిల్పూరు: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగురవేయాలని పార్లమెంట్ కోకన్వీనర్ యుగేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో స్థానిక ఎన్నికల కార్యాచరణ–ఏకగ్రీవ తీర్మానంపై మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర్లు, నాయకులు సంపత్ రెడ్డి, బాల్నె శ్రీనివాస్, కాదుగాయ రమేష్, ముక్కెర శ్రవణ్ పాల్గొన్నారు.

పొలంలో సాగునీటి పైపులైన్ డెలివరీ చానల్


రైతు పొలంలో నిర్మించిన సాగునీటి డెలివరీ చానల్

తరిగొప్పుల: దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్–2 పనుల్లో భాగంగా చేపట్టిన సాగునీటి పైపులైను నిర్మాణం పనులను సదరు కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా చేపడుతున్నారని మండలకేంద్రానికి చెందిన రైతు గునిగంటి కనుకయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. మండలకేంద్రం రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 889/1లో 1.30 గుంటల వ్యవసాయ భూమి ఉందన్నారు. కాగా, పైపులైన్ నిర్మాణం పనులు దక్కించుకున్న జీవీఆర్ కంపెనీ ఇంజనీర్లు తనకు సమాచారం ఇవ్వకుండా భూమిలో పైపులైను డెలివరీ చానల్ నిర్మించారని వాపోయాడు. మా అనుమతి లేకుండా డెలివరీ చానల్‌ను ఎందుకు నిర్మించారని సదరు కంపెనీ ఇంజనీర్ శ్రీనివాస్‌ను అడిగితే ఇష్టం ఉన్నచోట చెప్పుకో అని బెదిరిస్తున్నాడని సదరు రైతు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు చొరవతీసుకొని డెలివరీ చానల్‌ను అక్కడి నుంచి తొలగించాలని, నిర్మాణ కంపెనీ జీవీఆర్‌పై తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేశాడని ఫిర్యాదు


విలేకరులతో మాట్లాడుతున్న బాధిత రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: తమ వ్యవసాయ పొలాలకు బోర్ల ద్వారా సాగునీరు అందించుకునేందుకు వినియోగించే ట్రాన్స్‌ఫార్మర్‌కు పెదపూండ్ల రవీందర్‌రెడ్డి అనే రైతు తాళం వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని నమిలిగొండకు చెందిన పలువురు రైతులు కోరారు. ఈ మేరకు వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసి మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ కింద ఏళ్ల తరబడి 20 మంది రైతులు దాదాపు ఇరవై బోరు మోటార్లతో 60 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన పెదపూండ్ల రవీందర్‌రెడ్డి అనే రైతు ట్రాన్స్‌ఫార్మర్ తన స్థలంలో ఉందని, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. కాగా, రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసి దిక్కున్న చోట చెప్పుకోవాలని అంటున్నాడని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమై పోలీసు అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు. రైతులు పి.ఎల్లారెడ్డి, సారల్ రెడ్డి, రాకేష్, రమేష్, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, శ్రావణ్, మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వాసుదేవరెడ్డి ఉన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


జనగామ: జిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకల్లో నాయకులు


పాలకుర్తి టౌన్: హెల్మెట్‌లను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్

సాక్షి నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ మంచి విజన్ ఉన్న నాయకుడని, అభివృద్ధి, ఆవిష్కరణలు, ప్రజా సంక్షేమం ఆయన లక్ష్యాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా పాలకుర్తిలో పార్టీ శ్రేణులు మొక్కలు నాటి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

దేవరుప్పుల: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన గురువారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కామారెడ్డిగూడేనికి చెందిన కొంగ పుష్ప ఇంట్లో సామాను తెచ్చేందు కోసం ఈ నెల 22న ఇంటికి తాళం వేసి తిరుమలగిరికి వెళ్లింది. పని ముగించుకుని తిరిగి ఇంటికి రాగా తాళం పగలగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచిన బంగారు కమ్మలు, మాటీలు, కొంత నగదు దొంగలు అపహరించారు. ఘటనపై ఫిర్యా దు చేయగా దర్యాప్తు చేపట్టారు. గురువారం కామారెడ్డిగూడెం ఎక్స్ రోడ్డులో పోలీసులు తనిఖీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన తీగల సురేష్ అనుమానస్పదంగా కనిపించగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాశీ పుణ్య క్షేత్రంలో మహా అన్నదానం

జనగామ: పవిత్ర పుణ్యక్షేత్రం కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో అమావాస్య పురస్కరించుకుని పట్టణానికి చెందిన భక్తుడు ఈగం శ్రీనివాస్, దాతల సహకారంతో గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ, ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు బయన్నగారి మల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ఎ.రాధ, బి.ఏకానాథం, పి.సోమయ్య, విజయ, జె.యాదగిరి, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం వడ్డించాలి

నర్మెట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని మండల విద్యాధికారి ఐలయ్య అన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. హెచ్‌ఎంలు నీలం వేణు, గోపాల్‌రెడ్డి, పీఆర్‌సీలు దయాకర్, రవీందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చిల్పూరు: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు రంగు రవి అన్నారు. రాజవరం గ్రామంలోని జీపీ వద్ద గురువారం రవి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా పీఏసీఎస్ డైరెక్టర్ కిషన్‌రెడ్డి ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

జనగామ రూరల్: జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ఎదునూరు బాలనర్సయ్యకు చెందిన పాడిఆవు గురువారం వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. పాడి ఆవు విలువ రూ.95వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నారు.

సంక్షిప్త సమాచారం

బకాయిలు వెంటనే చెల్లించాలి

దేవరుప్పుల ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే మొదటి విడుత బకాయిలను చెల్లించాలని ఉస్మానియా విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వీరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని సింగరాజుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అనేక మంది లబ్ధిదారులు మొదటి దశ నిర్మాణాలు పూర్తి చేసినప్పటికి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో నిర్మాణాలు నిల్చిపోయాయన్నారు.

ఎన్నిక

దేవరుప్పుల: మండల శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురువారం ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఇరుకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వనమాల శ్రీనివాస్, కోశాధికారి యామ సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

నర్మెట: ఎరువుల దుకాణాలలో విత్తనాలు, మందులను కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని ఏడీఏ అపర్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆమె సందర్శించి యజమానులకు పలు సూచనలు చేశారు. దుకాణాల ఎదుట ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు.

పింఛన్లు పెంచాలి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు, చేయూత పింఛన్లు రూ.4 వేలకు పెంచాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామి నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు గురువారం సింగరాజుపల్లిలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు కొంగరి రాములు అధ్యక్షతన నిర్వహించిన పింఛనదారుల చైతన్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

నర్మెట: త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్‌లు బాల్నె సిద్దిలింగం, సురేష్ పిలుపునిచ్చారు. గురువరాం కన్నెబోయిన గూడెం క్లస్టర్ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

పాలకుర్తి టౌన్: మండలంలోని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న వేతాలను చెల్లించాలని గురువారం ఈ–కంప్యూటర్ ఆపరేటర్లు విధులు బహిష్కరించిన నిరసన తెలిపారు. అంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.

పోలీస్ కళాజాతా

తరిగొప్పుల: వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన బెట్టింగ్స్ గేమ్స్ వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం బానోత్ రవీందర్, ఏఎస్సై కాసర్ల రాజయ్య, కళాజాత బృందం ఇంచార్జ్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

రఘునాథపల్లి: గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గుర్రపు వేణు (28) కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేణు–కల్పన దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో సొంతింటి నిర్మాణం కోసం వేణు రూ.10 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే విషయంలో భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన వేణు ఈ నెల 23వ తేదీన రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఒక కూతురు ఉంది. భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసి నాయకులు

చిల్పూరు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బత్తుల విజయ్‌కుమార్‌ను భూమాత రైతు సంఘం నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్‌కు విన్నవించారు.

సన్మానం

తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను సీపీఎం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండల కార్యదర్శి సాదం రమేశ్, ఆవుల ప్రభాకర్, రాజు, నాగరాజు, శ్రవణ్ ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు తేలుకంటి శ్రీనివాస్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, గురువారం ఆయనను కాంగ్రెస్ నాయకుడు జంగిటి విద్యానాథ్ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.